ఆహ్లాదం.. అందనంత దూరం



ఆల్ ఎబిలిటీస్ పార్క్


ఇటీవల విరిగి పోయిన ఊయల


శిథిలావస్థలో ఆల్ ఎబిలిటీస్ పార్క్


పనిచేయని ఆట పరికరం


వెళ్లడానికి వీలులేని విధంగా


పెచ్చులూడిన ఫ్లోరింగ్


డంపింగ్ యార్డును తలపిస్తున్న లోపలి భాగం


విరిగిన ఆట వస్తువులు

ఆర్కే బీచ్‌కు ఆనుకుని ఏర్పాటు చేసిన ఆల్ ఎబిలిటీస్ పార్క్ ఆహ్లాదం పంచలేకపోతోంది. దివ్యాంగ పిల్లలకు సైతం ఉపయుక్తంగా నిలిచే విధగా ఈ పార్క్‌ను దాదాపు రూ.3.5 కోట్లతో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం పార్కులో ఆట వస్తువులు కొన్ని పూర్తిగా శిథిలమవగా, మరికొన్ని నిరుపయోగంగా మారిపోయాయి. వీకెండ్‌లో పిల్లలు ఎక్కువగా ఈ పార్కుకు వస్తారు. గతంలో పార్కు ఎంతో అందంగా..ఆటపరికరాలతో కళకళలాడేది. పిల్లలు కూడా ఎంజాయ్ చేసే వాళ్లు. రానురానూ దీని నిర్వహణ గాలికొదిలేశారు. పార్కు మధ్యలో ఓడను పోలిన నిర్మాణం విశేషంగా ఆకట్టుకునేది. ప్రస్తుతం ఈ మార్గం పూర్తిగా రంగులు వెలిసిపోయి కళావిహీనంగా తయారైంది. పార్క్‌లో ఒకే సారి ఆరు నుంచి పది మంది వరకు చిన్నారులు ఊగే ఉయ్యాల విరిగిపోయింది. పక్కనే మరొక ఆట వస్తువు కూడా పనిచేయడం లేదు.ప్రస్తుతం కేవలం రెండు జారుడు బల్లలు, తూగుడు బల్ల మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పార్క్ ఏర్పాటు చేసిన సమయంలో ఉన్న పచ్చదనం నేడు మచ్చుకైనా కనిపించడం లేదు. ఆహ్లాదాన్ని పంచే పచ్చదనం కరువవడం కూడా పార్క్‌కు పెద్ద వెలితిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, పార్క్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించే చర్యలు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

– ఏయూక్యాంపస్

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కార్తీక మాసం మంగళవారం పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలోని నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు అరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కర శర్మలు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు.

కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు


ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల వెనుక పూడికతో నిండిన కాలువ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్‌లో పలుచోట్ల కాలువలు పూడికతో నిండిపోయాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుక వీధిలో ప్రధాన కాలువ చెత్తతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు కొందరు కాలువలో చెత్త వేస్తుండడంతో సమస్య జఠిలంగా మారింది. దీంతో ఆ ప్రాంతంలో కాలువ భాగం డస్ట్‌బిన్‌గా మారిపోతోంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తుండడంతో జ్వరాలు సోకుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది తక్షణం స్పందించి కాలువలో పూడికలు తీయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరకు ఘన నివాళి


ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగరాజ కుమారి తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో ఐఏఎస్ఈ, ఇగ్నో కేంద్రం సంయుక్తంగా మంగళవారం భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ నిర్వహించి, విద్యార్థులను భాగస్వామ్యులను చేశారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. విద్యార్థులు నవ్య,దీపక్,పాల్,సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు పుష్ప, సోనీ హవిల, తిరుమలాంబ, విద్యావతి, శ్రీదేవి, పీడీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో మంగళవారం పారిశుద్ధ్య విభాగం అధికారులు స్థానికులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో నివాసాల మధ్య బ్యానరు కట్టి స్టాల్ ఏర్పాటు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధం, దానికి బదులుకు వినియోగించాల్సిన సంచులు గురించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు స్థానికులకు వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను కిరాణా షాపులు, నివాసితులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ఆరిలోవలో సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ఆరిలోవ 11వ వార్డులో మంగళవారం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ దుర్గాలమ్మ గుడి నుంచి ముస్తఫాకాలనీ వరకు సాగింది. అక్కడ సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరిలోవ ప్రాంతంలో నాలుగేళ్లుగా సొంత ఇళ్లలేని పేద వారు ఎక్కువగా ఉన్నారన్నారు. కూటమి ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైనవారికి ఇంటి స్థలంతో పాటు నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ కార్యదర్శి రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు విమల, దేవుడమ్మ, లక్ష్మణరావు, పుష్పలత పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లకు రేడియం రంగులు


సూర్యతేజనగర్ వద్ద స్పీడ్ బ్రేకర్లపై వేసిన రంగులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి సూర్యతేజానగర్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న అనధికారిక స్పీడ్ బ్రేకర్లకు స్థానికులు ఎట్టకేలకు రేడియం రంగులు వేశారు. సూర్యతేజానగర్ వద్ద ప్రధాన రహదారిపైన, దారపాలెం వద్ద బీఆర్టీఎస్‌లో సమీపంలో కొందరు అధికారులు దృష్టికి తీసుకువెళ్లకుండా అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అవి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దారపాలెం వద్ద ఓ యువకుడు ఈ స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురై ప్రాణాలు సైతం కోల్పోయాడు. దీనిపై 'డేంజర్ బెల్స్' శీర్షికతో మంగళవారం సాక్షిలో వెలువడిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో కొందరు యువకులు స్పీడ్ బ్రేకర్లకు తెలుపు–పసుపు రేడియం రంగులు వేశారు. ఇదిలావుండగా అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే వెలగపూడి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బాక్సింగ్‌లో గాయత్రి కళాశాల విద్యార్థుల సత్తా


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య బోస్ తదితరులు

ఎంవీపీకాలనీ: బాక్సింగ్‌లో రాణించిన ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాల విద్యార్థులను ఆ యాజమాన్యం అభినందించింది. ఇటీవల ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా ఇంటర్ యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న రాకేష్‌రోశన్ యాదవ్ రజకపతకాన్ని సాధించాడు. దీంతో పాటు బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.హరీశ్, బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.వాసవి, ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.రమ్యలతలు కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. ఈ నేపథ్యంలో ఆయా క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ మంగళవారం సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యూజీ కోర్సుల డైరెక్టర్ డి.గిరిధర్, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆచార్య పి.మోహిని, ఫిజికల్ డైరెక్టర్ పి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సత్యసాయి విద్యార్థుల ప్రదర్శనలు


ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. వనరుల వినియోగంలో సుస్థిర అభివృద్ధి– లక్ష్యాలు, పునర్వినియోగం, రీసైక్లింగ్ అంశాలపై స్కూల్ ప్రాంగణంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 4వ, 5వ తరగతుల విద్యార్థులు పాల్గొని వారి వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణ అనుకూల గృహాల నిర్మాణం, నీటి సంరక్షణ, అడవుల సంరక్షణ పద్ధతులు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ పద్ధతులతో కూడిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో ఆలోచనా దృక్పథం, ఆవిష్కరణల నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ ప్రదర్శన నిర్వహించినట్లు పాఠశాల అధ్యాపకులు వెల్లడించారు. ఆయా ప్రాజెక్టుల తయారీలో విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇగ్నో 39వ వ్యవస్థాపక దినోత్సవం


ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మారావు తదితరులు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలో ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో ఇగ్నో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఉన్నత విద్య ఇగ్నోతోనే సాధ్యమవుతుందన్నారు. దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను సామాన్యులకు చేరువచేసిన ఘనత ఇగ్నోకి దక్కుతుందని కొనియాడారు. ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా ఇగ్నో సరికొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ఇగ్నో ఉప సంచాలకుడు డాక్టర్ ఇ.కృష్ణారావు, సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గ్రంథాలయం ఆవరణంలో జరిగిన ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. తొలుత స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటంతో పాటు సరస్వతిదేవి చిత్రపటాల వద్ద విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జేకే స్కూల్ టీచర్స్ సత్యశ్రీ, పద్మలు ఈ పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంవీపీ గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 20వ తేదీన జరిగే ముగింపు సభ ఈ వారోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ సుభాషిని పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ


ఈవీఎం గోదాం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకొని పాత డెయిరీఫారం వద్ద ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్ తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులు, ఎన్నికల సెల్ అధికారులతో కలిసి రిజిష్టర్ కలెక్టర్ సంతకం చేశారు. అనంతరం గోదాంలో వీవీ ప్యాట్‌లు పరిశీలించారు. సీసీ కెమెరాలు పనితీరుపై ఆరా తీశారు. పక్కాగా రక్షణ ఉండాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎన్నికల విభాగం అధికారులకు ఆయన ఆదేశించారు.

జీసీసీ చైర్మన్‌కు గిరిజన సంఘం అభినందన


శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ (జీసీసీ) కిడారి శ్రావణ్‌కుమార్‌ను గిరిజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల జీసీసీ నూతన చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి డాక్టర్ లంకెల మధుకుమార్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయన్ని కలిసి అభినందించారు. గిరిజన ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెట్ చేయడంతో పాటు ఆయా ఉత్పత్తుల పండించడం, తయారీలో గిరిజనులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించాలని ఈ సందర్భంగా మధుకుమార్ కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చల్లంగి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏవోకు అభినందనలు


ఏవో అప్పారావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

డాబాగార్డెన్స్ : కేజీహెచ్ పరిపాలన అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీఎస్ అప్పారావును ఆస్పత్రి ఎస్సీ, ఎస్టీ యూనియన్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాస్ నేతృత్వంలో పలువురు ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్‌ఓ, ఎమ్ఎన్‌ఓలకు యూనిఫాం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏవో స్పందిస్తూ త్వరలోనే యూనిఫామ్స్ అందజేస్తామని తెలిపినట్టు శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు వెంకటరావు, పార్వతి, ఎస్కే బేగం, సిరుపల్లి రాజారావు, కాంతం, కె.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


కోటేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ ఎంట్రప్రెన్యూర్ డేని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోర డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో సాగర్ కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రోన్స్ రంగంలో ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగడం, విజయం సాధించడం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష కలిగిన వారికి స్ఫూర్తిని అందించే విధంగా ఈ ప్రసంగం సాగింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి వాల్యూమెట్రిక్ ఎనాలసిస్ చేసే విధానాన్ని ఆయన తెలియజేశారు. ప్రణాళిక, డేటా సంపాదించడం, డేటా ప్రాసెస్ చేయడం, ప్రాజెక్ట్స్ పూర్తి చేయడం అనే దశలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తాను నిర్వహించిన పలు ప్రాజెక్టులను విద్యార్థులతో పంచుకున్నారు. అదే విధంగా ఆ హబ్ అందిస్తున్న ప్రోత్సాహం, ఇటీవల సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. పద్మశ్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య బి.ప్రజ్ఞ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ కోటేశ్వరరావును కళాశాల తరపున సత్కరించారు. డ్రోన్ వ్యవస్థకు సాగర్ అందిస్తున్న సేవలు, కృషి ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ


ట్రోఫీలతో శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు, అధ్యాపకులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు ఇటీవల విజయనగరం జిల్లా జరిగిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచారు. మంగళవారం గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 16 వరకు విజయనగరంలో విశాఖ జోనల్ మీట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించారన్నారు. ఆ క్రీడా పోటీలలో శ్రీకృష్ణాపురం గురుకులం నుంచి పాల్గొన్న ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు ట్రోఫీలు సాధించారన్నారు. సీనియర్ విభాగంలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థి సీహెచ్ అభినవ్ షా పుట్, డిస్కస్‌త్రోలలో బంగారు పతకాలు, జావిలిన్‌త్రోలో సిల్వర్ పతకం సాధించాడన్నారు. జూనియర్ విభాగంలో పరుగులో డి.దీక్షిత్ చరణ్ తేజ 1500 మీటర్లలో ద్వితీయ స్థానం, ఆర్.శివకుమార్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. చదరంగంలో పదో తరగతి విద్యార్థులు సీహెచ్.ఆదిత్య యశ్వంత్ ద్వితీయ స్థానం, క్యారమ్స్‌లో కె.ఎల్ నారాయణ, ఆర్ పందీప్ ట్రోఫీని కైవసం చేసుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని గురుకులంలో అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాష్ కార్యక్రమంపై డీఆర్‌డీఏలో సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

ఎంవీపీకాలనీ: జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో వాష్ (వాటర్, శానిటేషన్, హైజీన్) కార్యక్రమంపై జిల్లా ఏపీఎంలకు, డీపీఎంలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో యూనిసెఫ్, సెర్ప్ అధికారుల సమన్వయంతో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత మంచినీరు నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వాహణ, వ్యర్థాల నిర్వహణ, వ్యక్తిగత అలవాట్లలో మార్పులు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించడంతో పాటు శిక్షణ అందించారు. వీరు మండల స్థాయిలోని వీఓఏలకు, సంఘ సభ్యులకు పూర్తిస్థాయిలో కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పిస్తారని పీడీ లక్ష్మీపతి ఈ సందర్భంగా తెలిపారు. దీంతో పాటు పీజీఆర్ఎస్ అర్జీలను సైతం ఎప్పటికప్పుడు పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.పుల్లయ్య, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.